క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముప్పాళ్ళ: విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో గల 11 కేవీ లైన్స్, ఉప కేంద్రంలోని పరికరాల మరమ్మతుల కారణంగా ఈ నెల 13వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని గ్రామాల్లోను విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలను కొట్టడం, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సత్తెనపల్లి పట్టణంలో శనివారం(నేడు) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238కు ఫోన్ చేయాలన్నారు.

పెదకూరరపాడులో...

పెదకూరరపాడు: పెదకూరపాడు, 75త్యాళ్ళూరు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో రెండవ శనివారం విద్యుత్ మరమ్మతుల నిర్వహణ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ జి.శివకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ ఆధారిత వ్యాపారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

బాల్యవివాహాలను అరికడదాం




రాజుపాలెం: బాల్య వివాహాలను అరికట్టాలని ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలోని పెదనెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగమల్లేశ్వరి మాట్లాడుతూ రుతు క్రమంలో వచ్చే అపోహలను కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.శైలజ, ఎన్.కనకదుర్గ, ఆర్.పద్మ, ఎన్.వెంకటరమణ, బి.సోవమ్మ పాల్గొన్నారు.

డెంగీని నివారిద్దాం



నకరికల్లు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తిని అరికట్టడంలో పాలు పంచుకోవాలని జిల్లా డీఎంవో డాక్టర్ రత్నాకర్ పిలుపునిచ్చారు. డెంగ్యీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణే ఉత్తమ రక్షణ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 31 వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారిద్దామన్నారు. తీవ్ర జ్వరం, చలి, ఒంటి నొప్పులు, కీళ్లు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలను డెంగీగా గుర్తించాలన్నారు. లక్షణాలను బట్టి సంబంధిత వైద్యశాలలో చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మణికంఠ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం ఎంతో అవసరం



కారెంపూడి: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర నష్టమని, చెట్లను తొలగించడం తగదనే విషయాన్ని అందరూ గుర్తించాలని కారెంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) విద్యార్థులకు వివరించారు. మండలంలోని పేటసన్నెగండ్ల నరసింహపురి శ్రీ చక్ర సిమెంట్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై ప్రకృతి పాఠం బోధించారు. విద్యార్థులు ప్రతి చెట్టును పూజించాలని సూచించారు. తగినంత అడవులు లేకపోతే మానవ మనుగడ కష్టం అన్నారు. అందరం దీనిని నిర్లక్ష్యం చేస్తున్నామని వివరించారు. విత్తన బంతులతోపాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని వివరించారు.

ఖరీఫ్ సాగయ్యేనా...!?

- సకాలంలో వర్షాలు లేక ఆలస్యంగా సాగు
- అక్కడక్కడ బోర్ల కింద నారుమళ్లు
- వర్షాలు కురవకపోతే ఆ నీటిపైనా సందేహమే
- వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు



పొలం దున్నుతున్న రైతు

నకరికల్లు: రోహిణి, మృగశిర, ఆరుద్ర కార్తెలన్నీ ఒకదాని తరువాత ఒకటి వెళ్లిపోతున్నాయి. చినుకులు రాలుతున్నాయి తప్ప.. వర్షం జాడ మాత్రం కన్పించడం లేదు. సహజంగా ఈ కార్తెలో వర్షాలు పడి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు... ప్రారంభమైన దాఖలాలు కన్పించడం లేదు. అక్కడక్కడ బోర్ల కింద మాత్రం నారుమళ్లు ఇప్పుడిప్పుడే సిద్ధం చేసుకుంటున్నారు. సకాలంలో వర్షం జాడ లేక పోవడంతో అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుతుందా లేదా అన్న ఆందోళనలో ఉన్న అన్నదాతలు వరుణుడి కరుణ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

సాధారణంగా మండలంలో సాగు భూమి 18 వేల ఎకరాలకుపైగా ఉంది. 14,460 ఎకరాల్లో వరి, 958 ఎకరాల్లో కంది, 405 ఎకరాల్లో మినుము, 137 ఎకరాల్లో పెసర, 1,312 ఎకరాల్లో పత్తి, 1,000 ఎకరాల్లో మిర్చి తదితర పంటలను సాగు చేస్తారు. సాధారణంగా జూలై రెండో వారం నుంచి వరి నారు చల్లి సాగుకు సన్నద్ధమవుతారు. ఈ ఏడాది సమయం మించిపోతున్నా ఎక్కడా నారు మళ్లు సిద్ధం చేసుకున్న దాఖలాలు కన్పించడం లేదు. వర్షాలు కురవకుంటే బోర్లలో నీరు ఎంత స్థాయి వరకు వస్తుందన్న సందేహంలో వ్యవసాయ బోర్ల సౌకర్యం ఉన్న రైతులు ఆలోచనలో పడ్డారు.

వర్షాల పైనే అన్నదాతల ఆశలు

ప్రస్తుతం పునర్వసు కార్తె నడుస్తుంది. శ్రావణ, బాద్రపద మాసాలను వర్ష రుతువు. ఆగస్టు మొదటి వారంలో వర్ష రుతువు ప్రారంభం కానుండడంతో అన్నదాతల ఆశలన్నీ శ్రావణ మాసం వర్షాలపైనే ఉన్నాయి. కాగా జూలై చివరి కల్లా నారు మడులు సాగు చేస్తేనే సకాలంలో వరి పంట పండించే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు వాన జాడ లేకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ అదను మించిపోవడంతో ఒక్క పంట మాత్రమే వరి పండించ గలుగుతామని అన్నదాతలు అంటున్నారు.

ప్రత్యామ్నాయ పంటలు లాభదాయకం



వర్షాలు సకాలంలో లేని సమయంలో ప్రత్యామ్నాయ పంటల పైపు దృష్టి సారిస్తే సాగు లాభదాయకంగా ఉంటుంది. ఆగస్టు మొదటి వారం వరకు అంటే మరో 15 రోజుల పాటు సాగర్ కెనాల్ నీటి కోసం ఎదురు చూడవచ్చు. అప్పటికీ సాగు నీరు రాకుంటే వర్షాధార పంటలుగా కంది, సోయాబీన్స్, పత్తి, మిర్చి అలాగే బోర్ల ద్వారా నీటి తడులు ఇచ్చే అవకాశం ఉంటే మొక్క జొన్న లాంటి పంటలు సాగు చేసుకోవచ్చు.

– కె.దేవదాసు మండల వ్యవసాయాధికారి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

సత్తెనపల్లి టౌన్ సీఐ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని దుకాణాలు, అరుగులు, రోడ్లపై మద్యం సేవించరాదన్నారు. పోలీసుల ఆదేశాలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలా సేవించిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును. ఎవరైనా గంజాయి కొన్నా, అమ్మినా గంజాయి సేవించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. గంజాయి ఎవరైనా అమ్మినా, కొన్నా పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. సమాచారాన్ని సత్తెనపల్లి టౌన్ సీఐ 9440796230, సబ్ డివిజన్ డీఎస్పీ 9440796208 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్

అచ్చంపేట: సీజనల్‌గా వచ్చే జ్వరాలు, ఒళ్లు నొప్పులు, జలుబు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. దోమల ద్వారానే వ్యాధులు ఉధృతమవుతాయని, లార్వా దశలోనే దోమలను నశింపచేయాలని డాక్టర్ రాజేష్ సూచించారు. జ్వర తీవ్రత తగ్గేంత వరకు ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వైద్య శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరాలతో బాధపడుతున్న 8 మందికి రక్త పరీక్షలు చేశారు. జ్వరాల వల్ల భయపడాల్సిన పనిలేదని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నందు వల్ల సీజనల్‌గా వచ్చే జ్వరాలేనన్నారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం కాలనీలో ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. సైడు కాలువలలో ఎబెట్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. మురుగు కుంతలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించారు. వాడని గాబులను బోర్లించాలని, తాగేసిన కొబ్బరిబొండాలను ఊరికి దూరంగా వేయాలని, ఎరువు దిబ్బలను ఇంటి పరిసరాలలో ఉంచుకోకూడదని చెప్పారు. వైద్య శిబిరం మరో నాలుగు రోజులు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పర్యవేక్షకులు రాధాకృష్ణ, బేబిరాణి, సీహెచ్‌వో శివనాగమణి, సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ జి.చిన్నపరెడ్డి, ఏఎన్ఎం దుర్గ, ఆశావర్కర్స్ ఎం.సుజాత, సీహెచ్ సుజాత, టి.చిన్నమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పుట్టిన ఊరికి, చదివిన పాఠశాలకు పేరు తీసుకురావాలి

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు



రామగోపాలరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

పెదకూరపాడు: పుట్టిన ఊరికి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువులు నేర్పిన గురువులకు ఉత్తమ పౌరులుగా ప్రతి విద్యార్థి పేరు తీసుకురావాలని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంకొండ రామగోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామగోపాలరావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. గ్రామ పెద్దలు ఆర్తిమళ్ల రమేష్, భాష్యం ఆంజినేయులు, నెల్లూరి మల్లిఖార్జున రావులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల మెరుగుకు చర్యలు

ఎంపీపీ బూడిద మంగమ్మ



మాచర్ల రూరల్: గ్రామాలలో ప్రబలుతున్న అంటు వ్యాధుల నివారణకు అధికారులు వెంటనే పారిశుద్ధ్య పనులను మెరుగు పరచాలని ఎంపీపీ బూడిద మంగమ్మ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని గుర్తుచేశారు. వీటి నివారణకు కాలువలలో పూడికతీత పనులు, వీధులు శుభ్రపరచటం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న సమయంలో రైతులకు కావాల్సిన సలహాలను అధికారులు అందించాలని కోరారు. నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. వైద్యులు గ్రామాలలో పర్యటించి డయేరియా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. పార్టీలకతీతంగా నాయకులు కలిసి ప్రగతి కోసం సాగాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, పరిమళ మనీషా, ఎంపీడీవో సరోజనీదేవి, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రంగానాయక్, అధికారులు డాక్టర్ శివలీల, ఎంఈవో అల్లి సురేష్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ముక్కా గురవయ్య, మాధ్యానాయక్, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

మాచర్ల రూరల్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లి, భైరవునిపాడు, కొత్తపల్లి గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. చెత్త తొలగింపు, డ్రైనేజీలో పూడికతీత చేపట్టారు. అంటు రోగాల నివారణకు ప్రజలు వీధులను శుభ్రంగా ఉంచాలని ప్రచారం చేశారు. సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పి.బ్రహ్మనాయుడు, భైరవునిపాడు కార్యదర్శులు ఆవుల వెంకట్రామయ్య, ఎల్లెబోయిన కోటేశ్వరరావులు పనులను పర్యవేక్షించారు.

15 నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోను ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా ఈ నెల 15 నుంచి గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో పి.శ్రీకృష్ణ శుక్రవారం తెలిపారు. 15వ తేదీన కుందురువారిపాలెం, గోళ్ళపాడు, రుద్రవరం గ్రామాల్లోను, 16న తొండపి, మాదల, లంకెలకూరపాడు గ్రామాల్లోను, 18న బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లోను, 19న తురకపాలెం, ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, పలుదేవర్లపాడు, ఇరుకుపాలెం, నార్నెపాడు గ్రామాల్లోను గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగే గ్రామ సభలలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సభ్యులు గుర్తించిన అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు. పనులకు సంబంధించి నిర్వహణలో ఏమైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా కందుల



కందుల లక్ష్మీకాంత్ బ్రహ్మేశ్వరరావు

పెదకూరపాడు: ఆంధ్రప్రదేశ్ కాపు హక్కుల పరిరక్షణ సమితి పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా పెదకూరపాడు గ్రామానికి చెందిన కందుల లక్ష్మీకాంత్ బ్రహ్మేశ్వరరావును నియమించినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి ఫణికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ కాపు, ఉపకులాల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కందుల లక్ష్మీకాంత్ బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్షత బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఫణికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాపుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

రైల్వే సీఐగా ఏడుకొండలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే పోలీస్ స్టేషన్ సీఐగా కె. ఏడుకొండలు శుక్రవారం బదిలీపై వచ్చారు. ఆయన గతంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం



పిడుగురాళ్ల: సబ్సిడీ కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రాజు సూచించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం ప్రాంగణంలో సబ్సిడీపై కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కిలో రూ. 160కి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్సిడీ తహసీల్దార్ సరోజ, దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు కొత్త సత్యనారాయణ, పెండ్యాల రామారావు, ఏలూరి లక్ష్మయ్య, కొత్త హనుమంతరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గుండా రామారావు, కట్టమూరి శంకర్‌రావు, శివయ్య, ఏలూరి చంద్రశేఖర్‌రావు, హనుమంతరావు, లక్ష్మణబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మాచర్ల రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ముళ్ళ ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మున్సిపల్ ఉద్యోగి భైరు రామారావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగిలించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

క్రోసూరు: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై షఫీ సూచించారు. శుక్రవారం క్రోసూరులోని మసీద్ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సమయంలో ప్రమాదం జరిగితే ఎక్కడ గాయమైనా కోలుకోవచ్చు. తలకు గాయమైతే మాత్రం కోలుకోవడం కష్టమని.. కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉందన్నారు. చిన్న అజాగ్రత్త వల్ల భారీ నష్టాన్ని కొని తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ ధరించడం మీ క్షేమం, మీపై ఆధారపడిన మీ కుటుంబ సభ్యుల కోసమని తెలుసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వ కూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. అలాగే వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని.. సకాలంలో వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ మండల పరిషత్ సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై షఫీ

క్రోసూరు: ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పేరుపమాళ్ల పల్లి కోటయ్య అధ్యక్షతన జరిగింది. నూతన కూటమి ప్రభుత్వంలో ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపీడీవో వెంకటరమణ, క్రోసూరు మండల ఎస్సై షఫీ, తహసీల్దారులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై షఫీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు కోసం పలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే నెల బియ్యం, పంచదార, కందిపప్పు ఇస్తామని వెల్లడించారు. ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి వివాదాలు లేకుండా మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఘర్షణలకు అవకాశం ఉంటుందని ముందస్తుగానే పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థినులు



సీహెచ్ కోమలి | సీహెచ్ దీపిక | ఆర్.రేణుక | కుందనపల్లి వైష్ణవి | కె.తనూజ

సత్తెనపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారిలో సీహెచ్ కోమలి, సీహెచ్ దీపిక, ఆర్.రేణుకలు ఉన్నారన్నారు. ఎంపికైన ముగ్గురు విద్యార్థినులను ఆమె అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థిని

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలకు చెందిన కుందనపల్లి వైష్ణవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ శుక్రవారం తెలిపారు. బెల్లంకొండ మండలం రామాంజపురం గ్రామానికి చెందిన వైష్ణవి మాదలలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో చదివి పదవ తరగతిలో అత్యధికంగా 568 మార్కులు సాధించింది. గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపికల్లో ఒంగోలులో సీటు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవిని బోధనా సిబ్బంది, విద్యార్థినులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థినులు



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థినులు

క్రోసూరు: మండల పరిధిలోని క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థినులు ఈ నెల 11న ప్రకటించిన ఫలితాల్లో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం మేరిసుజన శుక్రవారం తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి మౌల జాస్మిన్, చంద్రికలు ఎంపికయ్యారని వెల్లడించారు. పదో తరగతిలో మౌల జాస్మిన్ 570 మార్కులు, చంద్రికకు 570 మార్కులు సాధించారన్నారు. సీటు సాధించిన విద్యార్థినులకు విద్యా శాఖ అధికారులతో పాటు ఆ పాఠశాల హెచ్ఎం మేరిసుజన, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ అభినందనలు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థినులు మాట్లాడుతూ తమ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, అంకితభావంతో కూడిన విద్యా బోధనతో తాము ఈ సీట్లు సాధించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, గణేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 75త్యాళ్ళూరు విద్యార్థిని

పెదకూరపాడు: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు గ్రామంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థిని కె.తనూజ ప్రతిభ కనబర్చింది. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనూజ పదో తరగతిలో 563 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమంగా నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల పేరేంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డిలు తనూజను అభినందించారు.

25 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 25 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల పరిధిలోని 11 గ్రామాలలో మొత్తం 36 ప్రభుత్వ పాఠశాలల్లో 124 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉండగా.. 99 మంది ఉన్నారు. 2024–25 విద్యా సంవత్సరం జూన్ 13న ప్రారంభం కాగా 3,852 మంది చదువుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయడానికి చర్యలు చేపట్టలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 3,436 మంది విద్యార్థులకు మాత్రమే స్టూడెంట్స్ కిట్స్ అందించారు. కొత్తగా చేరిన సుమారు 400 మందికి ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.